# చేతికి చిక్కిన పిట్ట

రైలు నడుస్తున్న చకచక శబ్దం సన్నగా వినబడుతోంది. అప్పుడు గ్రహించాను, అద్దాల తలుపులు మూసిఉన్నాయని. వెంటనే అన్నీ తెరిచాను. ఉవ్వెత్తుగా వేడిగాలి, బొగ్గునెరుసులూ. పెద్ద శబ్దం పెట్టెని దురాక్రమణ చేశాయి. నడివేసవిలో కూపేలో ప్రయాణం చెయ్యడం బుద్ధిపొరబాటు. అద్దాలతలుపులు దించితే ఉక్క. ఎత్తితే వేడిగాలి. చీకటిపడ్డా ఇంకా చల్లబడలేదు గాలి.

అందులో కూపేలో ఒంటరిగా ఎన్నడూ ప్రయాణం చెయ్యకూడదు. కూడా ఎవరైనా ఉండాలి తోడు. వయసు మళ్ళుతున్న కొద్దీ వాంఛ లెక్కువౌతాయి.

అప్పుడూ నడివేసవే. అయితే ఆరోజులు వేరు. పెళ్ళయిన రెండో రోజుని నేనూ మా ఆవిడా బెంగుళూరు ప్రయాణం. ముందుగా టిక్కెట్టు కొనుక్కోవాలనీ. బర్తులు రిజర్వుచేయించుకోవాలని కూడా తోచలేదు. మా అమ్మకి మాత్రం సూచనగా చెప్పి, ఎవరికీ తెలియకుండా టాక్సీ ఎక్కించేశాను మా ఆవిణ్ణి. వెనకాల ఇంకో టాక్సీమీద మా బావమరిది మమ్మల్ని తరుముకొచ్చాడు. మౌంట్‌రోడ్డులో పట్టుకున్నాడు. మా ఆవిడకో పెట్టెనిండా

వీరలూ, నాచేతికి కొంతడబ్బూ ఇచ్చి, నా భుజంమీద తట్టి వెళ్ళిపోయాడు.

ప్లాట్‌ఫారమ్‌మీద కంగారుగా తిరుగుతుంటే, పరమేశ్వర్రావు పలకరించాడు. ఎవరు మీరు, ఎక్కడికి అన్నాడు. బహుశా రిజర్వేషన్ ఇనస్పెక్టరుని నేను ప్రాధేయపడుతూ అడగడం చూసి ఉంటాడు. అతను గార్డని అతని దుస్తులే చెపుతున్నాయి. అదే అతనితో మొదటి పరిచయం. తరవాత ప్రాణస్నేహితుడైపోయాడు. పరమేశ్వర్రావు మహా గొప్పమనిషి. మమ్మల్నిద్దరినీ ఒక కూపేలో పారేశాడు పెట్టెతో సహా. అన్ని తలుపులు మూశేశాం. అప్పుడు ఉక్కా లేదు, చిరాకూ లేదు. ఆకలి లేదు. నిద్రాలేదు. రాత్రి పదో పదకొండో, పరమేశ్వర్రావు వచ్చి తలుపుతట్టాడు.

"మీరు ఆకలేస్తోందో లేదో తెలియని స్థితిలో ఉన్నారు, నేను మాత్రం మిమ్మల్ని నిరసనవ్రతం చెయ్యనివ్వ" నన్నాడు. ఒక కుర్రాడు నాఎత్తు కారియరు తీసుకొచ్చి కూపేలో పెట్టాడు. తినడం ప్రారంభించిందాకా, మాకంత ఆకలిగా ఉందని మాకు తెలియదు. పరమేశ్వర్రావు గొప్ప వ్యక్తి, మంచి స్నేహితుడు.

ఆ పిచ్చి ఉత్సాహంలో అన్నీ మరచిపోగలం - వేసవి, ఉక్క, చిరాకు అన్నీ, ఇప్పుడా వుత్సాహం వచ్చినా రాదు. వయసు మళ్ళుతున్న సమయంలో వెన్నెల మీదికీ చల్లగాలి మీదికి మనసుపోదు. మనసులోనే వెన్నెలా చల్లగాలీ ఉన్నప్పుడు, ఇంక బయట అవి లేకపోతేనేం ? ఎప్పుడైతే వీటికోసం మనిషి తహతహ పడతాడో, అప్పు డతనికి వార్ధక్యం వచ్చేసిందన్నమాటే.

సూళ్లూరుపేట గాబోలు, ఎందుకో రైలాగింది. తలుపు తెరిచాను.

"హల్లో మిస్టర్ రామానుజులూ! అనుకోకుండా కలుసుకున్నాం" అంటూ కూపేలోకి ఎక్కా డొక పెద్దమనిషి.

"రండి, రండి" అన్నాను. అతనెవరో నాకు గుర్తురాలేదు.

ఎక్కడో చూచిన ముఖమే. ఎక్కడా అని? పెద్దమనిషిలాగే ఉన్నాడు. ఎవరైతేనేం? నాకు తోడుగా ఉంటాడు. ఒంటరిగా ఈ ఉక్క అనుభవించడం కంటె మరొకరితో పంచుకుంటే కాస్త నయం. కాస్త మాటల్లో పెట్టి అతని ఆచూకీ లాగాలి. ఇంత చనువైన ముఖాన్ని ఎల్లా మరచిపోయాను? వయసు మళ్ళుతోం దనడానికి వేరే నిదర్శన మెందుకు?

"ఎంతవరకు?"

"చెప్పలేను. బెజవాడదాకా తప్పదు. అవసరమైతే వాల్తేరు."

చంపాడే. నాలుగు జిల్లాల్లో ఎక్కడని నిర్ణయించడం? 'మీ రెవరు బాబూ, నాకు గుర్తురాలే' దంటే మర్యాదగా ఉండదు. గోడమీది పిల్లి వాటంగా ఈ సంభాషణ ఎంతసేపు నడపటం?

"ఇప్పు డేం జేస్తున్నారు?"

"ఏముందండి. మామూలే."

ఇదేం బాగా లేదు. మా ఇద్దరికీ పరిచయమున్న స్నేహితుల పేర్లన్నా అతని నోటంటవస్తే కాస్త అల్లుకుపోవచ్చు.

"ఈ మధ్య మీరు క్లబ్బుకి వస్తున్నట్టు లేదే - మన రామినీడు సెక్రటరీ అయాడు తెలుసుగా," అన్నాను సాహసించి.

"తెలియదండి" అని సమాధానం.

ఏం తెలియదు? రామినీడు తెలియదా? అతను సెక్రటరీ అయిన సంగతి తెలియదా? ఏమైతే అయిందని మరో ప్రశ్న వేశాను.

"పిల్లా జెల్లా అంతా కులాసా?"

"లోకమంతా నా పిల్లలే. ఆ మరణ బ్రహ్మచర్యం నాదీక్షని తమకి తెలుసుగా. ఆమాత్రం లక్ష్యబుద్ధి నాకు లేదనుకున్నారా? హ-హ-హ."

ఆ నవ్వు నన్ను ఎగతాళిచేస్తూ రైలు చప్పుడులో లీనమై పోయింది. నవ్వు ఆగిపోయాక కూడా, రైలు చప్పుడులో అది ధ్వనించినట్టు నా కనుమానం. అదృష్టవశాత్తూ గోవిందు సూళ్లూరు పేటలో వచ్చి నా పెట్టెలో పెట్టిన కారియరు గుర్తుకొచ్చింది. ఇంక

ఆ ఆసామీని వదిలేసి, భోజనంచేసి నిద్రపోదామని నిర్ణయించు కున్నాను. అయినా మర్యాదకోసం అన్నాను.

"రండి, భోజనం చేద్దాం."

"నేను రాత్రిపూట భోజనం చెయ్యనుగా."

సరే, ఆయ నెవరో తెలియకపోతే నా కొచ్చిన నష్ట మేముంది? అవసరమైతే ఆయనే చెప్పుకుంటాడు. నేనెందుకు మథనపడాలి? అయినా నన్నంతగా తెలిసున్నవాడు తన ఊరూ పేరూ చెప్పుకుంటే ఏం? నన్నిల్లా శ్లేష్మంలోపడ్డ ఈగలాగ బాధ పెట్టకపోతే!

భోజనం బాగా లేదు. పెరుగు పుల్లగా ఉంది. కారియరు మూత పెట్టేసి చెయ్యి కడుక్కున్నాను.

రంగారావుని ఈ కంపార్ట్‌మెంట్‌లో ఎక్కమనవలసింది. కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేద్దుం. అయితే నేను రమ్మని అనందే అత నెల్లావస్తాడు? ఈ గవర్నమెంట్ ఉద్యోగాల్లో చిన్నా, పెద్దా తారతమ్యాలు చిన్నవాళ్ళూ, పెద్దవాళ్ళూ, కూడా మరచి పోలేరు. నేను సూపరిండెంటునీ అతను సర్కిలూ, రేపతను సూపరింటెండెం టయితే తనమీద సర్కిల్‌ని ఆమడదూరంలో అట్టే పెడతాడు. ఇదొక జబ్బనుకుంటాను. నిజానికి నాపక్కని కూర్చున్న ఆసామీ కంటే రంగారావు ఏం తీసిపోయాడు? వీడు నాతో సమాను డనిపించి, రంగారావు అనిపించకపోవడం మరి జబ్బు కాదూ? అధమం వీడి పేరన్నా తెలిస్తే బాగుండును.

"సిగరెట్టు కావాలా మిస్టర్...." కావాలనే పొడిగించాను, అతను పేరేమన్నా భర్తీ చేస్తాడేమోనని.

"నేను కాల్చనండి" అన్నాడు ముక్తసరిగా.

"ఎప్పటినించి మానేశారు మిస్టర్. సుబ్బారావు?" అన్నాను యాదాలాపంగా.

"చాలా రోజు లయింది."

అయితే ఈయనపేరు సుబ్బారావన్నమాట. ఆంధ్రదేశంలో అర్థభాగం సుబ్బారావులే. ఇంక ఆ పేరు పెడితే కఠినశిక్ష వేస్తామని ప్రభుత్వం ఒక చట్టం జారీచేస్తే బాగుండును. సుబ్బారావనేది, మగవాడికి పర్యాయపదంగా అయిపోయింది తెలుగు దేశంలో. అన్నట్టు కన్నడదేశంలోనూ ఉన్నారు సుబ్బారావులు. ఒకవేళ ఆరోజుల్లో బెంగుళూరులో అయిన పరిచయం కాదుగదా. ముఖం మాత్రం ఎక్కడో చూసినట్టే ఉంది.

"అన్నట్టు సుబ్బారావుగారూ"

"నాపేరు రామారావండి."

"అదే. రామారావుగారూ!...."

చచ్చానురా దేవుడా అయితే ఇందాకా సుబ్బారావని పిలిస్తే ఎందు కూరుకున్నాడు? పోనీ, పేరన్నా బయటపడింది. పడితే ఏం లాభం? ఆంధ్రదేశంలో సగంమంది సుబ్బారావు లయితే మిగతా సగం రామారావులు.

ఏడిసినట్టుంది! నా కెందుకీ తాపత్రయం? అందులో ఈ వయసులో. వెల్లకిల పడుకుని కళ్ళు మూశాను. ఆలోచనలు శ్రీధర్ వేపు మళ్ళించాను.

శ్రీధర్ దొరికితీరుతాడు. చేతిలో చిక్కినట్టే చిక్కి పాదరసంలా జారిపోయాడు, వేళ్ళమధ్యనించి, రంగారావుది అసలు తప్పు, మనిషిని పట్టుకోగానే నాకు కబురు చెయ్యొద్దూ? పెద్ద మెహర్బానీ అంతా తనే పులుముకుందామనుకుంటున్నాడు. లేదు, అది అన్యాయం, రంగారావుకి తోడెవరూ లేరు. శ్రీధర్ అకస్మాత్తుగా కనబడ్డాడు. పాతస్నేహితుడిలా నటించి తన ఇంటికి తీసుకుపోయాడు. శ్రీధర్‌కి గుండెలు లేవు. పట్టపగలు. పదిమంది చూస్తుండగా బ్యాంకులో ప్రవేశించి కాషియర్ని బెదిరించి, పదివేల రూపాయలు పట్టుకుపోయాడు. మనిషిని పట్టుకుంటే చాలు. పది మోతుబరీసాక్ష్యా లున్నాయి కేసు రుజువు చెయ్యడానికి. రంగారావు పట్టాడు పాపం! అయితేం వాడు చండశాసనుడు. ఆ శ్రీధర్

దొడ్డికొస్తోందని వెళ్ళి అల్లాగే దాటేశాడు. అదృష్టవశాత్తూ సెంట్రల్ ట్రాఫిక్‌పోలీసూ అతన్ని చూసి అనమాలు పట్టాడు. స్టేషన్‌నించి బయటికి పోవడం అసంభవం. ఇంక ఈ రైళ్ళలోనే ఎక్కాలి. కలకత్తామెయిల్, బొంబాయిమెయిల్, బెంగుళూరుమెయిల్. దొరక్క ఎక్కడికి పోతాడు? అన్ని రైళ్ళూ సోదా జరుగుతున్నాయి.

ఏం చెప్పినా రంగారావుదే తప్పు. ఇంత అనుభవమున్న వాడు దొడ్డికి పోతానన్నవాణ్ణి ఒంటరిగా వదలిపెడతాడా? సరే, చేతులుకాలాక ఆకులు పట్టుకుంటే ఏంలాభం? పాపం రంగారావుకి చిన్నతనంగా ఉంది. అందుకే నాతో ఈ పెట్టెలో ప్రయాణం చెయ్యడానికి ఒప్పుకోలేదు. అతన్ని బుజ్జగించాలి. మనిషన్న తరువాత పొరబాటు చేయకుండా ఉంటాడా?

"మిస్టర్ రామానుజులూ, నిద్రపోతారా?" అన్నాడు ఆసామీ.

"తొందరపడకండి. గూడూరు దాటాక పడుకుంటాను."

అసలింతకీ నేనెవరినో అతనికి తెలుసా? నాపేరు తెలుసు. అంతకుమించి ఏమన్నా తెలిస్తే సంభాషణలో బయటపడదూ? నాలాగే ఆయనా తికమకపడుతున్నాడా? నాలాగే మేమెక్కడ కలుసుకున్నదీ, మాకిద్దరికీ తెలిసిన స్నేహితుల్ని గురించీ గుర్తు తెచ్చుకోడానికి ప్రయత్నిస్తున్నాడా?

అమ్మయ్య! నా మనసు కొంత తేలికపడింది. ఆయనా, నేనూ ఒకే స్థితిలో ఉన్నాం. హ - హ - హ - చిత్రమయిన పరిస్థితే. ఇంక సుఖంగా మాట్లాడొచ్చు. ఎక్కడైనా ఇద్దరికీ తెలిసిన పేరు తగిలితే, రెండు వక్కలా సమస్య పరిష్కారమైపోతుంది.

"రామారావుగారూ! మొన్న తిరువేంగడం ఆడాడండి, అద్భుతం" అన్నాను.

"అల్లాగాండి" అన్నాడు అనుమానంగా అసలు తిరువేంగడం ఎవరో ఇతనికి తెలిసినట్టులేదు. భేష్! మహాసరదాగా ఉంది.

కాలక్షేపానికి లోటులేదు. అదీగాక ఇంతసేపూ నన్నుతను మధన పెట్టినదానికి ప్రతీకారం సాధించాలని నా మనస్సులో ఊరికే ఉబలాటం.

"ఒకొక్క బ్రేకు, నూరుకి తక్కువ లేదు. నాలుగువందలూ అయిదువందలూ, మంచినీళ్ల ప్రాయంగా కొట్టేశాడండి."

"ఓహో !"

అంత తేలిగ్గా అంటాడేం? మనస్సెంత విచిత్రమైనది? ఈ రామారావు నా మనస్సులో ఒక్కొక్కప్పుడు ఆయన, ఒకక్కప్పుడు అతను, ఒక్కొక్కప్పుడు వాడు, మనసు స్థితినిబట్టి అతని యెడల మర్యాద నిర్ణయమౌతుంటుంది.

"ది తీఫ్ అన్న పిక్చర్ చూశారా? ఒక్క సంభాషణలేదు. చాలా గొప్పగా తీశారండి."

"చూడలేదండి" అన్నాడు ముభావంగా. అలా చూస్తాడేం పరధ్యానంగా?

అబ్బ! పెట్టెలో ఎంత ఉక్కగా ఉంది. ఆ గూడూరు వచ్చినట్లుంది. వేగం తగ్గుతోంది. తలుపు తెరిచి గుమ్మంలో నిలబడ్డాను. రైలు ఆగ్గానే కిందికి దిగాను. రంగారావు వస్తున్నాడు దూరాన్నించి, నా పెట్టిదగ్గరికి. అమ్మయ్య ప్రాణం లేచొచ్చినట్లుంది. రంగారావు వచ్చాడు. ఇద్దరం పచారుచేస్తున్నాం, రంగారా వన్నాడు:

"అన్ని పెట్లూ గాలించాం. ప్రతిమనిషినీ పరీక్షగా చూశాం. ఈ రైల్లో లేడండి."

"అస లిందులో ఎక్కలేదేమో ?"

"లేదండి. ఇందులోనే ఎక్కాడు. ఎందుకంటే మన హెడ్ కానిస్టేబుల్ స్లీపర్‌బండిలో ఒక ప్రక్కనించి ఎక్కగానే రెండో పక్కనించి దిగిపోయాడట శ్రీధర్."

"ఎక్కడ?"

"సూళ్ళూరుపేటలో"

"అరె! అయితే అక్కడే రైలాపేసి అంతా సోదాచేస్తేపోయేదిగా?"

"అదేనండీ, అతను చేసిన పొరబాటు, నాతో చెప్పలేదు. తనంతట తనే ఏం చేశాడంటే, అన్ని కంపార్టుమెంట్లలోనూ త్రిలోక కానిస్టేబుల్‌ని ఎక్కించి సోదా చేయించాట్ట. మొదటినించి చివరి దాకా తను కూడా చూశాట్ట రైలు కదులుతుండగానే."

"అయితే వాడు సూళూరుపేటలోనే దాటేశాడు. ఇంక మనం ఈ రైల్లో ప్రయాణంచేసి ఏం లాభం?"

'అదేనండి' అని నసిగాడు రంగారావు. "హెడ్ ఇక్కణ్ణించీ అన్ని స్టేషన్లకీ ఫోన్ చేస్తున్నాడు. అన్ని చోట్లా బందోబస్తు చూస్తుంటుంది శ్రీధర్‌కోసం, ముఖ్యంగా సూళూరుపేట పోలీసు స్టేషనుకి కబురు అందవెయ్యమన్నాను."

"మనం ఇప్పుడు మద్రాసు చేరుకోడం ఎల్లా?"

"ఇక్కడ మా స్నేహితుడు మైకామైన రొకత నున్నాడు. అతని కారు పంపమని చీటీ వ్రాసి ఇచ్చి ఒక కానిస్టేబుల్‌ని పంపాను."

"సరే గోవిందుని పిలు, నా సామాను దింపడానికి."

నేను తిరిగి కంపార్టుమెంటులోకి ఎక్కాను రామారావు పై బర్తుమీద పడుకున్నాడు, నేను పక్క చుట్టుతుంటే అడిగాడు.

"ఏంసార్? దిగిపోతున్నారేం?"

"కొంచెం కథ అడ్డం తిరిగింది లెండి" అన్నాను,

నా సంగతి వీడికెందుకు చెప్పాలి? నేనెవర్నో నాఉద్యోగం ఏమిటో, ఏ పనిమీద బయలుదేరానో, ఎందుకు మధ్యలో దిగిపోతున్నానో, ఒక్కడూ ఈ పెట్టెలో పడుకుని ఊహించుకోనీ, రాత్రి తెల్లవార్లూ చనువుగా పలుకరించి నా దుంప తెంచాడు నాలుగు గంటలు, ఇకమీద వాడు చావాలి, రాత్రంతా నా ఆలోచనలతో నిద్రపట్టక, రామారావు కిందికి దిగాడు.

"మీరీ బర్తు ఉపయోగించవచ్చు" అన్నాను మెహర్బానీగా.

"ధన్యవాదాలు" అన్నాడు.

ఇంతలో గోవిందొచ్చాడు.

"గోవిందూ! బాత్‌రూములో సబ్బూతువ్వాలూ ఉంటాయి తియ్యి, అదుగో ఆ పుస్తకాలు రెండూ చిన్న పెట్లో పెట్టెయ్యి. నీళ్ళ బుడ్డి మరిచిపోకు."

గోవిందు సామాను దింపడం పూర్తి చేసేసరికి రంగారావొచ్చాడు.

'ఏమోయి రంగారావు, నీ సామాను దింపావా?'

"దింపానండి"

"శెలవండి రామారావుగారూ!" అంటూ గుమ్మంలో కొచ్చాను దిగడానికి, నేను దిగగానే తలుపు మయ్యడానికి రామారావు నా వెనకే నిలబడ్డాడు, రంగారావు దయ్యాన్ని చూసినట్టు నా వెనక దేన్నో చూస్తూ నిలబడిపోయాడు.

"అలా తెల్లబోయి చూస్తావేమిటోయి, నన్ను దిగనీ, రైలు కదులుతోంది" అని చిరాకుగా కిందికి దూకాను. రంగారావు అకస్మాత్తుగా విజిల్ ఊదాడు. కదలిన రైలు కర్రుమంటూ ఆగింది. నేను దిగిన పెట్టె దగ్గరకు పరుగెత్తాడు రంగారావు. రంగారావు అరుస్తున్నాడు.

"అటునుంచి రండి, ఆ పక్కకి దిగిపోయాడు. అడుగో వాడే శ్రీధర్ అడుగో, ఆ గూడ్సు పెట్టెల చాటుకి పోయాడు. పరిగెత్తండి, పట్టుకోండి."

"ఏడీ శ్రీధర్ ఎక్కడ?" అన్నాను ఆత్రంగా.

"వాడేనండి మీ కంపార్టుమెంట్‌లో ప్రయాణం చేసినవాడే, నా మొహం కనబడగానే అవతల్నించి దిగిపోయాడు, మీరడ్డుండి పోయారుగాని...." మాట పూర్తి కాకుండానే రంగారావు. పరుగెత్తి వెళ్ళిపోయాడు.

ఓహో! మైగాడ్! శ్రీధర్ మొహమే, ఫోటోలో చూశానుగా! అతను నా పేరెట్లా కనుక్కున్నాడు? నన్నెరుగుండి పెట్టెలోకి ఎలా ఎక్కాడు? నన్నెరగడు. అది ఖాయం. అయితే నా పేరెల్లా తెలిసింది! రిజర్వేషన్ కార్డు! ఓరి మట్టిబుర్రా! పోలీసు శిక్షణలో

ప్రథమ సూత్రం మరిచిపోయావు గదా, చూసిన ప్రతి మొహం పట్టుకోవలసిన వాడి ఫోటోతో పోల్చి చూసికోమన్నారుగా? అసలా ఆలోచనయినా తట్టిందా?

పైగా చేతికి చిక్కిన పిట్టని వదిలేశాడని రంగారావుని తూలనాడాను. అతనికన్న పెద్ద దద్దమ్మనన్న సంగతి రుజువైపోయింది. ఎంత వెర్రిపని చేశాను? ఎంత మట్టి బుర్రనాది? చేతికి చిక్కిన పిట్ట! ఒకసారి తప్పించుకున్నాక మళ్ళీ దొరుకుతుందా? చేతికి చిక్కిన పిట్ట!